


## ఆధునిక హంగులతో కొత్త ఠాణాల నిర్మాణం

పెద్దపల్లి టౌన్, జనవరి23: పెద్దపల్లి మహిళ, రూరల్ ఠాణా భవనాలను ఆధునిక హంగులతో నిర్మించనున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్, బంధంపల్లిలోపి ప్రభుత్వ పాఠశాల స్థలాలను సీపీ గురువారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మహిళా ఠాణా, బంధంపల్లిలో రూరల్ పోలీస్‌స్టేషన్, ప్రస్తుత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలోనే కొత్త ఠాణా భవనాలు నిర్మిండచంతో పాటు ఆధునీకరించనున్నట్లు వివరించారు. ఇక్కడ డీసీపీ డాక్టర్ చేతన, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ బర్ల అనిల్‌కుమార్, ఎస్‌ఐలు లక్ష్మణరావు, శ్రావణ్ కుమార్, సనత్‌కుమార్ ఉన్నారు.

## స్టేట్ హైవే ప్రకటించకపోతే మరో ఉద్యమం

జూలపల్లి, జనవరి 23 : కాళేశ్వరం నుంచి కామారెడ్డి దాకా ప్రభుత్వం స్టేట్ హైవే నిర్మించకపోతే మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని సామాజిక కార్యకర్త మారం తిరుపతియాదవ్ స్పష్టం చేశారు. జూలపల్లిలో గురువారం సామాజిక కార్యకర్తలు గ్రామస్తులను కలిసి సంతకాలు తీసుకున్నారు. కాళేశ్వరం నుంచి మంథని, పెద్దపల్లి, జూలపల్లి, చొప్పదండి, రామడుగు, గంగాధర్, వేములవాడ, కామారెడ్డి వరకు దాదాపు 210 కిలోమీటర్ల పొడవునా రోడ్లు అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతాలు అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాలు సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తామని వెల్లడించారు.

## ప్రతి విద్యార్థికి ఆపార్ ఐడీ తప్పనిసరి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 23: ప్రతి విద్యార్థికి ఆపార్ ఐడీ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో ఎస్ మహేశ్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఆపార్ వర్క్‌షాప్ ను ఎంఈవో గురువారం పరిశీలించారు. ఆపార్ ఐడీల ద్వారా విద్యార్థుల డేటా నిర్వహణలో పారదర్శకతను పెంచడమే కాకుండా విద్యా డేటాను ఒకే చోట నిల్వ చేస్తుందన్నారు. విద్యార్థులకు భవిష్యత్ అవసరాలను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ జాలిగం రమేశ్, ఎమ్మార్సీ సిబ్బంది రమేశ్ , ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

## ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లి, జనవరి23: ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని, వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇరుకుళ్ల రాజనర్సయ్య కోరారు. పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయ ఆవరణలో ఆర్టిజన్లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని బీఎస్పీ నాయకులు సందర్శించి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ యాదవ్, కోశాధికారి పులిపాక బొందాలు, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ కిషన్ రెడ్డి, కన్వీనర్ మట్టరాజు, కో-చైర్మన్ దుర్గం విశ్వనాథ్, ఫైనాన్స్ సెక్రటరీ దేవేందర్, శ్రీనివాస్ రెడ్డి, కాంపెల్లి రఘు, జడల సత్యం, దాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, జనవరి 23: ఎల్కపల్లి గేట్‌కు చెందిన చిట్టబోయిన నరేశ్(35) కుటుంబ కలహాలతో గురువారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంపతుల మధ్య జరుగుతున్న గొడవలతో భార్య శ్యామల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో నరేశ్ మద్యానికి అలవాటు పడ్డాడు. జీవితంపై విరక్తి చెంది అద్దె ఇంటిలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేశ్ తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నరేశ్‌కు కుమారులు యశ్వంత్, రిశ్వంత్ ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాల తనిఖీ

అంతర్గాం, జనవరి 23: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను ఆర్జేడీ కే సత్యనారాయణ గురవారం తనిఖీ చేశారు. జడ్పీహెచ్‌ఎస్, కస్తూర్బా, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యా బోధనను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడానికి పాటించాల్సిన నియమాల గురించి వివరించారు.


శిక్షణ అభ్యర్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

## నిరుద్యోగ యువతకు చేరువయ్యేలా ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జనవరి23: టాస్క్ సెంటర్ అందిస్తున్న శిక్షణ నిరుద్యోగ యువతకు చేరువయ్యేలా ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలేడ్జ్) రీజినల్ సెంటర్‌ను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. టాస్క్ సెంటర్‌లో ప్రస్తుతం మూడో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ టాస్క్ రీజినల్ హెడ్ కం ట్రైనర్ డాక్టర్ టీ కౌసల్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వండి


మాట్లాడుతున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లి టౌన్, జనవరి 23 : జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)కు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పెద్దపల్లి ఆర్డీవో బీ గంగయ్య కోరారు. ప్రవేశాలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లను వెంటనే ఇవ్వాలని తహసీల్దార్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో గురుకులాల ప్రవేశ పరీక్షపై సంబంధిత అధికారులతో ఆర్డీవో గురువారం సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లి డివిజన్ పరిధిలోని 11 గురుకులాల్లో పెద్ద సంఖ్యలో చేరేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రవేశాల కోసం అవసరమైన సర్టిఫికెట్లను విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న వెంటనే అందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆసక్తి గల విద్యార్థులు 2025 ఫిబ్రవరి 1లోగా కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో పాటు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న ఉంటుందన్నారు. వివరాలకు htt ps://tgcet.cgg.gov.in. వైబ్ సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. గురుకులా ల్లో ప్రవేశాలకు సంబంధించి పెద్దపల్లి కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారని, వి వరాలకు హెల్ప్ డెస్క్ నెంబర్ 180059 85459ను సంప్రదించాలని సూచించారు.

## పట్టణాభివృద్ధికి సహకరించండి

పెద్దపల్లి, జనవరి23: ప్రజలు సకాలంలో ఇంటి పన్ను, నల్లా బకాయిలు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఇంటి పన్నులు, నల్లా బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. నిర్ణీత కాలవ్యవధిలో వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని, కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారు ఇంటి నెంబర్ కోసం మున్సిపల్ కార్యాలయానికి రానవసరం లేదని, సీడీఎంఏ సైట్‌లో సెల్ఫ్ అసెస్మెంట్ ద్వారా రిజిస్ట్రేషన్, ఇంటి పర్మిషన్ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## బొమ్మల కొలువు సందర్శన

గోదావరిఖని, జనవరి 23: సింగరేణి ఆర్జీ-1 లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఇల్లందుక్లబ్‌లో అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును సింగరేణి పాఠశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. ఇక్కడ లేడీస్ క్లబ్ సభ్యులు కవిత, విజయ, శ్రీవాణి, హేమ, కల్యాణి ఉన్నారు.

## విలేజ్ ఇన్నోవేషన్ అవార్డుకు 'గోలివాడ'

- నీళ్లపై నడిచే సైకిల్ ఆవిష్కరణ


గోలివాడ ప్రదీప్ కుమార్

అంతర్గాం, జనవరి 23: మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గోలివాడ ప్రదీప్ కుమార్ విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు-2025కు ఎంపికయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీజేఐసీ) ద్వారా ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన యువకుల ఆవిష్కరణలను పరిశీలించి అవార్డుకు ఎంపిక చేస్తుంది. ఈ నేపథ్యంలో గోలివాడ ప్రదీప్‌కుమార్ నీటిపై నడిచే సైకిల్‌ను తయారు చేశాడు. టీజేఐసీ గుర్తించి ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సాగర్ తెలిపారు. ఈ సైకిల్ పర్యాటక రంగం, మత్స్యకారులు, ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడుతుందని భావించింది. ప్రతిష్టాత్మక ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికైన ప్రదీప్‌ను మాజీ సర్పంచ్ గుమ్ముల రవీందర్, గ్రామస్తులు ధర్మాజీ శ్రీనివాస్, ధర్మాజీ కుమార్, గుమ్ముల శ్రీకాంత్, గోలివాడ శేఖర్, కంది విజయ్‌కుమార్, అజయ్‌కుమార్, సంతోష్, కిశోర్ అభినందించారు.





